మాత్రం మీకన్నా అధికుడు. మనిషి దాన్ని తన ఆధ్యాత్మిక ఉన్నతికి ఉపయోగించుకుంటాడని అతనికా వివేకాన్ని ఇచ్చాను. కాని అతను దాన్ని సక్రమంగా వినియోగించుకోకుండా, మూర్ఖంగా దాన్ని తన వినాశనానికే ఉపయోగించుకుంటున్నాడు." దేవుడు జవాబు చెప్పాడు.

నిస్వార్ధ పూరిత చర్యలన్నీ వివేకంతో కూడిన చర్యలు. కాని స్వార్థంతో కూడిన చర్యలన్నీ మనిషిని తిరిగి జనన మరణాల్లోకి నెట్టే మూర్ఖపు చర్యలు.

## 70. ఆచరణ

ఆధ్యాత్మికత ఆచరణలో వుండాలి అని పెద్దలు చెప్తారు. ఆచరణలో వుండటం అంటే ఏమిటో వివరించే కథ ఇది.

ఓ ధనికుడి భార్య ఏడుస్తూ వచ్చి చెప్పింది.

"ఏమండి! సంతకి వెళితే నా మెళ్ళోని పది లక్షల విలువైన హారాన్ని ఎవరో దొంగ వెధవ కొట్టేసాడు."

"మంచి పనే జరిగింది." ఏమాత్రం విచారం లేకుండా చెప్పాడు ధనవంతుడైన ఆమె భర్త.

సాయంత్రం భార్య వచ్చి మళ్ళీ తన భర్తతో చెప్పింది.

"పోయిన హారం దొరికింది. దొంగ వెధవని రక్షక భటులు పట్టుకున్నారు."

"మంచి పనే జరిగింది." ఏమాత్రం సంతోషం లేకుండా చెప్పాడు ధనవంతుడైన ఆమె భర్త.

ఆ ధనవంతుడి సేవకుడు అడిగాడు.

"ఏమండి! హారం పోయినప్పుడు మంచి పనే జరిగింది అన్నారు. దొరికినప్పుడు కూడా మంచి పనే జరిగింది అన్నారు. ఈ రెండిటిలో ఏదో ఒకటే మంచి పని అయివుండాలి కదా?"

అందుకా ధనికుడు నవ్వి జవాబు చెప్పాడు.

"హారం పోయింది. ఆ పైన మనశ్శాంతి కూడా పోవాలా? ఏది జరిగినా అది మన మంచికే జరుగుతుంది కదా. ఏదో ఓ రోజు అన్నిటినీ వదిలేయాల్సిందే.

ఇప్పట్నించే కొద్ది కొద్దిగా వాటిని వదిలేస్తే పోయేప్పుడు అన్నీ వదిలేసామనే బాధ వుండదు. ఇక హారం తిరిగి లభించినప్పుడు నా భార్య, పిల్లలు సంతోషించారు. ఆఖరికి నువ్వు కూడా సంతోషించావు. ఇంతమంది సంతోషంగా వుండటం మంచిదే కదా అని 'మంచి పనే జరిగింది' అన్నాను. వస్తువులు వున్నా పోయినా నా మనసుని ఎందుకు దుఃఖభరితం లేదా ఆనందమయం చేసుకోవాలి? నా ఆనందం దుఃఖాల మీద బయటి వస్తువులు ఎందుకు ఆధిక్యతని కలిగి వుండాలి? ఎవరి మనసు వారి ఆధీనంలో వుంటేనే హాయి." వివరించాడా ధనికుడు.

## 71. మహాత్ముడి లక్షణాలు

రామానందానికి సాధు సన్యాసులని దర్శించడం బాగా ఇష్టం. ఐతే సరైన మహాత్ములు కనపడక అతను విసిగిపోయాడు. ఆ సంగతి తెలిసిన ఒకతను రామానందం దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"మా ఊళ్ళో ఓ మహాత్ముడు ఉన్నాడు. మీరు ఆయన్ని దర్శించ దలచుకుంటే నేను ఆయన దగ్గరకి తీసుకు వెళ్తాను."

"వస్తా కాని నేనడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పు. అతను తినే కంచం లోహందా లేక మట్టిదా?"

"అతనికి తినేందుకు అసలు కంచమే లేదు. దోసిట్లో పెట్టించుకుని తింటాడు." జవాబు చెప్పాడు అతను.

"సరే. అయన పడుకునేది గుడిసెలోనా లేక డాబా ఇంట్లోనా?"

"చెట్టు కింద పడుకుంటాడు. వర్షం రాత్రి మాత్రం దేవాలయం చూరు కింద పడుకుంటాడు."

"ఆయనకి ఉన్న ఆస్తిపాస్తులు ఏమిటి?"

"ఒంటి మీద గోచీ, ఎర్ర దారంలో కట్టిన ఓ పంచముఖ రుద్రాక్ష, చేతిలో తంబూరా తప్ప అతనికి నా అనే ఆస్తి లేదు."

"సరే. ఆయన దృష్టిలో దానం చేసేవాడు మంచివాడా? లేక దానం తీసుకునేవాడు మంచివాడా?"